సాక్షి
విజయనగరం
7
బుధవారం । 5 । జూలై । 2023

న్యూస్‌రీల్

తైక్వాండో పోటీల్లో పతకాల పంట

- కర్ణాటకలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఏడుగురు ఎంపిక



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 1, 2 తేదీల్లో తిరుపతిలో జరిగిన 40వ అంతర్ జిల్లాల తైక్వాండో పోటీల్లో మొత్తం 17 పతకాలు సాధించగా.. అందులో 8 బంగారు పతకాలు, 4 వెండి, 5 కాంస్య పతకాలు ఉన్నాయి. పోటీల్లో రెండు విభాగాల్లో పాల్గొన్న మొకర రేణుక రెండు బంగారు పతకాలు సాధించగా... ఎ.రిషిత, ఎస్.కుసమశ్రీ, పీవీఎం జెస్వర్, ఎస్.అఖిల్, ఐ.లక్ష్మీధర్, పి.జితేష్‌లు బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. ఎల్.చంద్రిక, సీహెచ్.మనోజ్, జి.అభిషేక్, లలితా కామేశ్వరిలు వెండి పతకాలు దక్కించుకోగా... ఎ.చందు, కె.జోసఫ్, సీహెచ్ అనంత్‌కుమార్ ఒక్కో విభాగంలోను, హర్షితా శర్మ రెండు విభాగాల్లో కాంస్య పతకాలు సాధించారు. పోటీల్లో బంగారు పతకాలు కైవసం చేసుకున్న క్రీడాకారులు ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.చారిప్రసాద్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి పతకాలు సాధించిన క్రీడాకారులను పలువురు ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు అభినందించారు.

మిగులు సీట్ల భర్తీకి చర్యలు

నెల్లిమర్ల రూరల్: పట్టణంలోని వేణుగోపాలపురం అంబేడ్కర్ గురుకుల కళాశాలలో మిగులు సీట్ల భర్తీ ప్రక్రియను మంగళవారం నిర్వహించారు. దీనిని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా సమన్వయకర్త తోట పద్మజ పరిశీలించారు. మిగులు సీట్ల భర్తీని పారదర్శకంగా చేపడుతున్నామన్నారు. మొత్తం 230 ఖాళీలుండగా ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 117 ఖాళీలను భర్తీ చేశామని చెప్పారు. భామిని, వియ్యంపేట, నెల్లిమర్ల కళాశాలల్లో ఆర్ట్స్ గ్రూప్‌కు సంబంధించి 117 ఖాళీలు భర్తీ కాలేదన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో..
సత్వర పరిష్కారం

- సేవల్లో శరవేగంగా పార్వతీపురం మన్యం జిల్లా
- 92.7 శాతం పరిష్కారంతో రాష్ట్రంలో ద్వితీయ స్థానం
- విజయనగరం జిల్లాలో 77.5 శాతం పరిష్కారం
- ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవతో సత్ఫలితాలు
- ధ్రువీకరణపత్రాలు అందడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు



విజయనగరం జిల్లా కొండకరకాంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తుదారుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ప్రభుత్వ సేవలను సత్వరమే అందించడమే గాక ప్రజా సమస్యలను శతశాతం పరిష్కరించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన 'జగనన్న సురక్ష' స్వల్ప కాలంలోనే లక్ష్యం వైపు దూసుకుపోతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఒక యజ్ఞంలా చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజల మన్ననలను పొందుతోంది. సేవల్లో 92.7 శాతం పరిష్కారంతో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానం దక్కించుకుంది. విజయనగరం జిల్లా కూడా 77.5 శాతం విన్న పాలను పరిష్కరించింది. ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవతో సత్ఫలితాలు వస్తున్నాయి. దరఖాస్తు చేసిన వెంటనే వ్యయప్రయాసల్లేకుండా ధ్రువీకరణపత్రాలు సకాలంలో చేతికందడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ సేవలను గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు చేరువ చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు శతశాతం సమస్యల సత్వర పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని శాసన సభ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి చెప్పారు. విజయనగరం నియోజకవర్గం పరిధిలోని కొండకరకాంలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యనేత నుంచి జన్మభూమి కమిటీల వరకూ దోచుకోవడం, దాచుకోవడం, పంచుకోవడంతోనే సరిపోయిందని ఆయన విమర్శించారు. అందుకు భిన్నంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అవినీతికి చోటులేని సంక్షేమ పాలనను నాలుగేళ్లుగా అందిస్తున్నారని చెప్పారు. చీపురుపల్లి నియోజకవర్గం గుర్ల మండలం ఎస్ఎస్ఆర్ పేటలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ... దేశంలో మరెక్కడా లేనివిధంగా ప్రజల వద్దకే వెళ్లి ప్రభుత్వ సేవలను ఉచితంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తమ నియోజకవర్గాల పరిధిలో పలుచోట్ల జగనన్న సురక్ష కార్యక్రమాలను పర్యవేక్షించారు. వివిధ సర్టిఫికెట్లను దరఖాస్తుదారులకు అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలోనూ జగనన్న సురక్ష కార్యక్రమం అన్ని మండలాల్లోనూ జరిగింది. మెంటాడ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర హాజరయ్యారు. సాలూరులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి అవనాపు విక్రమ్ పాల్గొన్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తదితర ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల పరిధిలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాలు విజయవంతమయ్యేలా పర్యవేక్షించారు.

4వ తేదీ వరకూ 'జగనన్న సురక్ష' సేవలిలా...

అంశం	పార్వతీపురంమన్యం	విజయనగరం
వలంటీరు యాప్‌లో నమోదైన వినతులు	16,320	35,041
రిజిస్టరైన టోకెన్లు	10,208	35,344
సేవల కోసం వినతులు	9,047	30,872
పరిశీలనలో వినతులు	555	6,894
పరిష్కరించిన వినతులు	8,390	23,924
తిరస్కరించినవి	102	54
పరిష్కార శాతంచీ	92.7	77.5

ప్రతి కుటుంబానికీ ఉపయోగం...



మా అబ్బాయి రవికుమార్ ఇటీవల ఇంటర్ పాస్ అయ్యాడు. ఇంజినీరింగ్ చదవాలనుకుంటున్నాడు. అబ్బాయి ఉన్నత చదువుల కోసం ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్న నాలుగు రోజుల్లోనే మాకు తీసుకొచ్చి అందజేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రతి ఒక్క కుటుంబానికి ఎంతో ఉపయోగం కలుగుతుంది.

– కరణం చైతన్య, విజయనగరం

వ్యయప్రయాసలు లేకుండా సర్టిఫికెట్



మాకు కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ కావాల్సి ఉంది. లీగల్ హైర్ సర్టిఫికెట్‌ను పొందాలంటే గతంలో చాలా వ్యయప్రయాసలయ్యేవని గ్రామంలో చెబుతున్నారు. నాకు గత వారం టోకెన్ ఇచ్చారు. ఈ రోజు అలజంగిలో నిర్వహించిన గ్రామ సభలో ఎఫ్ఎంసీ పేరిట సర్టిఫికెట్‌ను ఉచితంగా అందజేశారు. ప్రభుత్వానికి, అధికారులకు ధన్యవాదాలు.

– మెరువుల పార్వతి, బొబ్బిలి

నాలుగు రోజుల్లో చేతికి...



గతంలో నాకు కుల ధ్రువీకరణ పత్రం పొందడానికి 15 రోజులు పట్టేది. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు మా ఇంటికి వచ్చి దరఖాస్తు తీసుకున్నారు. నాలుగు రోజుల్లో సర్టిఫికెట్ నా చేతికి అందించారు. ఈ సేవలకు గాను నావద్ద నుంచి ఎటువంటి రుసుము తీసుకోలేదు.

– పొడుగు సూర్యకుమారి, సోలిపిసోమరాజుపేట, గుర్ల మండలం

ఏడాదిగా జరగని పని ఇన్నాళ్లకు...



నాకు రేషన్ కార్డు కొన్ని సాంకేతిక కారణాల వల్ల మంజూరు కాలేదు. జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నాను. ఆ సాంకేతిక కారణాలను పరిష్కరించి ఇన్నాళ్లకు నాకు రేషన్ కార్డు అధికారులు మంజూరు చేశారు. ఏడాదిగా జరగని పని జగనన్న సురక్ష కార్యక్రమం పుణ్యామంటూ పూర్తి అయ్యింది.

– బియ్యాల సూర్యకాంతం, మోపాడ, దెంకాడ మండలం

ఎట్టకేలకు పరిష్కారం



మా గ్రామం వారికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు విషయంలో ఇబ్బందులు వస్తున్నాయి. మేము రెవెన్యూ గ్రామంగా సంతకవిటి మండలంలో ఉండగా, మున్సిపాల్టీ వార్డుగా రాజాం మున్సిపల్ కార్యాలయ పరిధిలో ఉన్నాం. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఎక్కడా మంజూరయ్యేవి కావు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఈ సమస్యపై ఎమ్మెల్యే కంబాల జోగులు ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారం చూపించారు. సంతకవిటి రెవెన్యూ కార్యాలయం నుంచి మంజూరుచేశారు.

– నుంకర సత్తెమ్మ, పొనుగుటివలస, రాజాం పట్టణం.

తెలుగు ప్రజల హృదయాల్లో అల్లూరిది సుస్థిర స్థానం

- ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- అల్లూరి విగ్రహానికి నివాళి

విజయనగరం: తెలుగు ప్రజల హృదయాల్లో అల్లూరి సీతారామరాజుది సుస్థిర స్థానమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. అల్లూరి 126వ జయంతిని జిల్లా యంత్రాంగం, అల్లూరి సేవా సమితి ఆధ్వర్యంలో దాసన్నపేట రింగు రోడ్డులోని అల్లూరి కూడలి వద్ద మంగళవారం నిర్వహించారు. కోలగట్లతో పాటు కలెక్టర్ నాగలక్ష్మి, మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, డీఆర్వో ఎం.గణపతిరావు తదితరులు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి సేవాసమితి ద్వారా ఎస్.కోట, అనంతగిరి, రామభద్రపురం మండలాలకు చెందిన నలుగురు గిరిజన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున నగదు పారితోషికాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలకులకు ఎదురొడ్డి నిలిచి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు అల్లూరి అని పేర్కొన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద అల్లూరి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిదేనని చెప్పారు. దాసన్నపేట రింగురోడ్డులో అల్లూరి విగ్రహం ఏర్పాటుచేసి కూడలికి ఆయన పేరిట నామకరణం చేశామన్నారు. కూడలి శాశ్వత నిర్వహణకు ముందుకు వచ్చిన పోర్టు సిటీ స్కూల్ యాజమాన్యాన్ని, స్కూల్ చైర్మన్ కె.ఏ.ఆర్.రాజు(శివ)ను కోలగట్ల అభినందించారు. కార్యక్రమంలో పర్యాటక అధికారి లక్ష్మీనారాయణ, కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, కార్పొరేటర్ గాదం మురళి, అల్లూరి సేవాసమితి ప్రతినిధులు సుధాకర్ రాజు, శివాజీ, రామరాజు, రాంబాబు, సూర్యనారాయణరాజు, జి.ఎస్.ఎన్.రాజు, వర్మ రాజు తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్ నాగలక్ష్మి

నేడు కౌన్సెలింగ్

విజయనగరం పూల్‌బాగ్:

జిల్లా పరిషత్ యాజమాన్యంలో ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందగా ఏర్పడిన గణితం, ఆంగ్లం సబ్జెక్టు ఖాళీలను కన్వర్షన్ పద్ధతిలో భర్తీ చేస్తామని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. దీనికోసం అంగీకారం తెలిపే భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్‌లు, ఎల్ఎఫ్ ఎల్ హెచ్‌ఎంలు ఈనెల 5వ తేదీన ఉదయం 9.30 గంటలకు డీఈఓ కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సర్వీస్ రిజిస్టరు, సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలన్నారు. గణితం, ఆంగ్లం సబ్జెక్టులకు పదోన్నతి కౌన్సెలింగ్ 5వ తేదీన లేదన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పదోన్నతి కౌన్సెలింగ్‌కు సీనియారిటీ ప్రాతిపదికన అభ్యర్థులు యథావిధిగా హాజరుకావాలన్నారు. గ్రేడ్–2 హెచ్‌ఎంల పదోన్నతులకు సంబంధించి 28 మందికి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు.

కూలిన బతుకులు


- చెన్నైలో కుప్ప కూలిన కళాశాల ప్రహరీ
- నలుగురు భవన నిర్మాణ కార్మికులు దుర్మరణం
- మృతుల్లో ముగ్గురిది బాడంగి మండలం వీరసాగరం



ఘటనాస్థలంలో కూలీల మృతదేహాలు



సత్యం (ఫైల్)



ఆర్. కన్నయ్య(ఫైల్)



కె.జగన్నాథం(ఫైల్)

బొబ్బిలి/బాడంగి: పొట్టచేత పట్టుకుని భవన నిర్మాణ పనుల కోసం చెన్నై వెళ్లిన నలుగురు కూలీలను ప్రహరీ రూపంలో మత్యువు కాటేసింది. వారి కుటుంబాల్లో విషాదం నింపింది. గ్రామస్తులు, మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... బాడంగి మండలం వీరసాగరం గ్రామానికి చెందిన కొల్లి జగన్నాథం(55), దాలమ్మ దంపతులు, రాపాక కన్నయ్య(49), భోగి దంపతులు, నెక్కల్ల సత్యం(40), సూరమ్మ దంపతులు నెల రోజుల కిందట చెన్నైలోని కోయంబత్తూరుకు భవన నిర్మాణ పనుల కోసం వెళ్లారు. మెయిల్కశ్లలోని పుల్లచ్చి రోడ్డులో ఉన్న కృష్ణకాలేజ్ పాత ప్రహరీ పునర్నిర్మాణంలో భాగంగా పొక్లెయిన్‌తో కూలదోస్తున్నారు. ఆ శిథిలాలను తరలించే పనిలో కూలీలు మంగళవారం నిమగ్నమయ్యారు. ఆ సమయంలో ప్రహరీ ఒక్కసారిగా వీరిమీద పడిపోయింది. కొల్లిజగన్నథం, రాపాక కన్నయ్య, నెక్కల్ల సత్యం, ఉత్తరాదికి చెందిన మరో వ్యక్తి ప్రహరీ శిథిలాల కింద చిక్కిపోయారు. అక్కడికక్కడే మృతిచెందారు. మరో వ్యక్తి గాయపడ్డారు. కళ్లముందే భర్తలు మరణించడంతో వారి భార్యలు కన్నీటిసంద్రంలో మునిగిపోయారు. ఇంటి పెద్ద దిక్కును మృత్యువు కాటేసిందంటూ బోరున విలపించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం సిగనూరు ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. అనతరం గ్రామానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు.

విషాదంలో కుటుంబ సభ్యులు..

కూలీల మరణవార్తతో వీరసాగరంలో విషాదం అలముకుంది. గ్రామానికి చెందిన పెద్దలు ఘటనా స్థలానికి బయలుదేరారు. మృతుల్లో జగన్నాథంకు ఒక అబ్బాయి అమ్మాయి కాగా, అమ్మాయికి వివాహం జరిగింది. కన్నయ్యకు ఇద్దరు కుమారులు కాగా, ఇద్దరికీ పెళ్లయింది. వేర్వేరుగా ఉంటున్నారు. సత్యం పిల్లలు చిన్నవారు. ఊరిలో చదువుతున్నారు.

నాటి తతంగం..
నేడు రాద్ధాంతం

- ఇంటి నంబర్ లేకుండా టీడీపీ ప్రభుత్వ హయాంలోనే తప్పిదం
- 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందే జాబితా తయారు
- ఇప్పుడవి దొంగ ఓట్లు అంటూ టీడీపీ నాయకుల ఆరోపణలు



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఈ ఫొటో పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని లక్ష్మీనారాయణపురానికి చెందిన ఓటర్ల జాబితాలోని పేజీకి సంబంధించింది. అందులో పేర్లు ఉన్నవారంతా అర్హత ఉన్న ఓటర్లే. ఆ జాబితా కూడా 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో తయారైనదే. ఈ జాబితాలో కొంత మంది ఓటర్ల వివరాల్లో ఇంటి నంబరు సున్నా (0) అని ఉంది. అప్పుడు ఈ ఓటర్ల జాబితాతోనే టీడీపీ నాయకులు ఓట్ల కోసం ప్రచారం చేశారు. వారందరికీ స్లిప్పులు పంచారు. అప్పుడంతా బాగానే ఉంది. ఇన్నాళ్లకు అవి దొంగ ఓట్లుగా కనిపిస్తున్నాయి. వాటిని ఇప్పుడే జాబితాల్లో అక్రమంగా చేర్చారన్నట్లుగా టీడీపీ నాయకులు నానా రాద్ధాంతం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే, గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి వైఎస్సార్‌సీపీ చేతిలో చావుదెబ్బ తిన్న బొబ్బిలి చిరంజీవులు గత వారం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. తీరా అధికారులు గతంలో జరిగిన పొరపాటును ఆయనకు వివరించారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందే లక్ష్మీనారాయణపురంలో 779 ఓట్లు ఉన్నాయి. ఇంటి నంబరు సున్నా వేసినవి 16 ఓట్లు వాటిలో ఉన్నాయి.

ఓటరుకార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేయడానికి ఆధార్ కార్డు రెండు వైపులా నకలు తీసి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఒకవైపు మాత్రమే ఇవ్వడంతో అందులో ఇంటి నంబరు, చిరునామా లేకుండా పోయింది. దీన్ని సరిదిద్దకుండా వారికి ఇంటినంబరు 00 వేసి ఓటర్ల జాబితాలో చేర్చేశారు. అంతే తప్ప అక్రమ నమోదులు, దొంగ ఓట్లు ఏమీ లేవని అధికారులు మొత్తుకున్నా టీడీపీ వారి బుర్రకు ఎక్కలేదు. ఏ చిన్న విషయం దొరికినా మహాభాగ్యంగా భావిస్తూ, ఆ తప్పులను అధికార వైఎస్సార్‌సీపీకి అంటగట్టాలనే తాపత్రయంలో వారు ఉన్నారు. 'సున్నా నంబరు ఇంట్లో... 30 మంది ఓటర్లు' అంటూ ఈనాడు పత్రిక మెయిన్ పేజీలో ఈ నెల 1వ తేదీన అచ్చువేసింది.


టీడీపీ కావాలనే విషప్రచారం....



లక్ష్మీనారాయణపురం గ్రామంలో 30 అక్రమ ఓట్లు ఉన్నాయని స్వయాన మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఫిర్యాదు చేయడం సిగ్గుచేటు. వారి ప్రభుత్వ హయాంలోనే అధికారుల తప్పిదం జరిగింది. ఆధార్ కార్డు, ఓటరు కార్డు అనుసంధానం చేసేటప్పుడు ఇంటి నంబరు సున్నాగా నమోదుచేశారు. వారు చేసిన తప్పును ఇప్పుడీ ప్రభుత్వంపై మోపడం సరికాదు. మా గ్రామంలో ఎటువంటి అక్రమ ఓట్లు లేవు. టీడీపీ కావాలనే ప్రభుత్వంపై విషప్రచారం చేస్తోంది.

– జక్కు ప్రవీణ్, సర్పంచ్, లక్ష్మీనారాయణపురం, పార్వతీపురం

అవి అక్రమ ఓట్లు కావు...



లక్ష్మీనారాయణపురం గ్రామంలో అక్రమ ఓట్లు ఉన్నాయనడం అవాస్తవం. ఓటరు జాబితాను ఆధార్‌తో అనుసంధానం చేసినపుడు ఆధార్ కార్డులపై ఇంటి నంబర్లు లేకపోవడంతో ఇంటి నంబరు సున్నాగా నమోదు చేశారు. టీడీపీ చెబుతున్న 30 ఓట్లు ఒకే ఇంటికి సంబంధించినవి కావు.

– టి.వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దారు, పార్వతీపురం

తల్లి వెంటే తనయుడు..



కొడుకు మృతదేహానికి తొలుత అంత్యక్రియలు చేస్తున్న బంధువులు, తల్లి కోసం పక్కనే పేర్చిన చితి

- ఇంట్లో టీవీ చూస్తూ మృతి చెందిన తల్లి
- మరణవార్త విని ఆగిన కుమారుడి గుండె
- పావుగంట వ్యవధిలో తల్లీకొడుకులు మృతి
- కొట్టుగుమ్మడలో విషాదం



స్వయంప్రభ (ఫైల్)



వెంకటేష్ (ఫైల్)

వీరఘట్టం: ఒరే వెంకటేషూ... ఈ రోజు ఉదయం మీ అమ్మ ఇంటిలో టీవీ చూస్తూ సొమ్మసిల్లి పడిపోయింది. అందరమూ వచ్చి ముఖంపై నీళ్లు చల్లి అమ్మను లేపాము. ఎంతకూ అమ్మ లేవకపోవడంతో డాక్టర్‌ను పిలిచి చూపించాము.. అప్పటికే అమ్మ చనిపోయిందని డాక్టర్ చెప్పారు.. మీ అమ్మకు నువ్వు ఒక్కగానొక్క కొడుకువు.. నీ చేతుల మీదుగానే అంతిమ సంస్కారాలు జరగాలి.. తొందరగా ఇంటికి వచ్చేరా... అంటూ పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం కొట్టుగుమ్మడ గ్రామానికి చెందిన గుడివాడ స్వయంప్రభ (68) బంధువులు హైదరాబాద్‌లో ఉంటున్న ఆమె కుమారుడు వెంకటేష(45)కు సోమవారం ఉదయం 7.30 గంటలకు ఫోన్ చేశారు.

తల్లి చనిపోయిందనే విషయాన్ని ఆమె కొడుకు వెంకటేష్‌కు తెలియజేసిన పావుగంటకే ఉదయం 7.45 గంటలకు హైదరాబాద్ నుంచి వెంకటేష్ భార్య పావని స్వగ్రామంలోని బంధువులకు ఫోన్ చేస్తూ.. మా ఆయన గుండె ఆగి చనిపోయాడని తెలియజేయడంతో అందరూ నిర్ఘాంతపోయారు. అయ్యో...దేవుడా.. ఏమిటీ విధి... క్షణాల్లో తల్లీ, కొడుకులను నీ దగ్గరకు తీసుకుపోయావా అంటూ కన్నీటిపర్యంతమయ్యారు.

పావుగంట వ్యవధిలో..

వీరఘట్టం మండలం కొట్టుగుమ్మడ గ్రామానికి చెందిన స్వయంప్రభ కుమారుడు వెంకటేష్ 20 ఏళ్లుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. స్వగ్రామంలో ఉన్న తల్లికి ప్రతినెలా డబ్బులు పంపిస్తూ ఆనందంగా జీవనం సాగిస్తున్నాడు. ఇంతలో తల్లి మరణించిందని చెప్పడం, ఆ వెంటనే కుమారుడు గుండెపోటుతో చనిపోవడంతో మృతిడి భార్య పావని, ఇద్దరు కుమారులు రవితేజ, రాకేష్‌లు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇద్దరి మృతదేహాలకు మంగళవారం స్వగ్రామమైన కొట్టుగుమ్మడలో రెండుగంటల తేడాతో అంత్యక్రియలు పూర్తిచేశారు. వెంకటేష్ కుమారుడు రవితేజ తన తండ్రికి, నాన్నమ్మకు తలకొరివి పెట్టాడు. పావుగంట వ్యవధిలో తల్లీకొడుకుల మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

క్లుప్తంగా

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు



మద్యం తరలిస్తున్న వ్యక్తితో పోలీసులు

గంట్యాడ: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని లక్కిడాం గ్రామానికి చెందిన బోదంకి కనక సత్యం మద్యం విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ క్రమంలో మాటు వేసిన పోలీసులు..కొఠారుబిల్లి జంక్షన్ నుంచి గ్రామానికి మద్యం సీసాలు తరలిస్తుండగా బోదంకి కనకసత్యాన్ని అదుపులోకి తీసుకుని 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



ఘటనా స్థలంలో పైడిరాజు మృతదేహం

రామభద్రపురం: మండలంలోని ఆరికతోటలో విద్యుత్ షాక్ తగిలి ఓ రైతు మృతి చెందాడు. మంగళవారం జరిగిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆరికతోట గ్రామానికి చెందిన జాగాన పైడిరాజు(45) ఉదయం 9 గంటల సమయంలో తన పాడి ఆవుకోసం పచ్చగడ్డి కోయడానికి పొలంలోకి వెళ్లాడు.అయితే సోమవారం సాయంత్రం వీచిన గాలి, వర్షానికి హెవీ లైన్‌కు సంబంధించిన విద్యుత్ వైర్లు తెగి పడిన విషయం గమనించక పోవడంతో ప్రమాదవశాత్తు వైర్లు తగిలి షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

412కేజీల పీడీఎస్ బియ్యం పట్టివేత

గజపతినగరం: స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో ద్విచక్రవాహనాలపై అక్రమంగా తరలిస్తున్న 412 కేజీల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై గంగరాజు మంగళవారం రాత్రి తెలిపారు. మూడు ద్విచక్రవాహనాలపై తరలిస్తున్న పొట్నూరు అప్పలనాయుడు, ఇంకుల సన్యాసిరావు, ముప్పిడి గణేష్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పట్టుబడిన బియ్యాన్ని సీఎస్ డీటీ రవిశంకర్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి పీలుస్తున్న నలుగురి అరెస్ట్

విజయనగరం క్రైమ్: స్థానిక సీఎంఆర్ సమీపంలో గంజాయి పీలుస్తున్న నలుగురు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిషేధిత గంజాయిని వినియోగిస్తుండగా పట్టుకుని ఎస్సై గోపాల్ అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నకిలీ టీటీడీ సేవా టికెట్లు ఇచ్చి మోసం

ఆన్‌లైన్ ద్వారా పరిచయమైన వ్యక్తి టీటీడీలో సేవా టికెట్లు ఇస్తానని చెప్పడంతో నమ్మి కుటుంబ సభ్యులందరికీ సేవా టికెట్లను కొనుగోలు చేసిన ఓ వ్యక్తి మోసపోయాడు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక కాంబోవీధికి చెందిన దాడి భాస్కరరావు తిరుమలేశుని దర్శనం చేసుకునేందుకు గాను ఆన్‌లైన్‌లో వస్త్ర, అభిషేక తదితర టికెట్లను కొనుగోలుచేసేందుకు సిద్ధమయ్యాడు. అది గమనించిన రమణప్రసాద్ అనే వ్యక్తి తాను తిరుమలలో పనిచేస్తున్నట్లు చెప్పి, నమ్మించి రూ.లక్షా 84వేల 500తో మొత్తం కుటుంబసభ్యులందరికీ సేవా టికెట్లు బుక్ చేయించి పంపించాడు. అయితే భాస్కరరావుకు అనుమానం వచ్చి తెలిసిన వ్యక్తులు తిరుపతి వెళ్తే వారి ద్వారా ఆ టికెట్లను తిరుమల పంపించారు. అక్కడ అవి నకిలీవి అని తేలడంతో బాధితుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	59,060-00
బంగారం(22క్యా. 10గ్రా.)	54,150-00
వెండి (కిలో)	75,800-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240

స్వాతంత్య్ర పోరాటంలో అల్లూరి మార్గదర్శి

- భావితరాలకు వీరుల చరిత్ర బోధించాలి
- జేసీ మయూర్ అశోక్



అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



అల్లూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ తదితరులు

విజయనగరం అర్బన్: భారత స్వాతంత్య్ర పోరాటానికి అల్లూరి సీతారామరాజు మార్గదర్శిగా నిలిచారని సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. అతి పిన్న వయసులోనే దేశం కోసం త్యాగం చేసి స్వాంతంత్య్ర స్ఫూర్తిని రగిల్చిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. అలాంటి వీరుల గాథలను భావితరాలకు తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి జేసీ, డీఆర్‌ఓ, ఇతల అధికారులు నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సభలో జేసీ మాట్లాడుతూ అల్లూరిలోని నాయకత్వ లక్షణాలను, త్యాగస్ఫూర్తి, దేశభక్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వచ్చే 25 ఏళ్లలో దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా చూడాలని ఆకాంక్షించారు. డీఆర్‌ఓ గణపతిరావు మాట్లాడుతూ ఏమీ ఆశించకుండా దేశం కోసం ప్రాణాలను అర్పించిన వీరుడు అల్లూరి అని కొనియాడారు. యువత నిస్వార్థంగా ఆలోచించి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మెప్మా పీడీ సుధాకర్ మాట్లాడుతూ అల్లూరి దేశ భక్తిని వివరించారు. సమావేశంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి అల్లూరి

విజయనగరం గంటస్తంభం: అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా, జిల్లా పరిషత్ చైర్మన్, విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లదొరల దురాగతాలకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఎగసిపడ్డ ఉద్యమ కెరటం అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. భారత స్వాతంత్య్రం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్య్రం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి. తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుని చరిత్ర రాబోయే తరం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, ఇతర అధికారులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతపై దృష్టి అవసరం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

- నాడు నేడు పనులు నెలాఖరుకు పూర్తికావాలి
- రెండురోజుల్లో సర్వే ముగించాలి
- అధికారులతో కలెక్టర్ నాగలక్ష్మి సమీక్ష

విజయనగరం అర్బన్: జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని పాఠశాలల్లో నాడు నేడు పనులు జరుగుతున్న కారణంగా విద్యార్థుల భద్రతపై దృష్టి పెట్టి, ప్రమాదాల నివారణకు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ, ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ ఆదేశించారు. భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్ని పాఠశాలల్లో సెప్టిక్ ట్యాంకు, సంప్ ట్యాంకు, పునాదుల కోసం తవ్విన గోతులు, ఐరన్ రాడ్లు తదితర నిర్మాణ సామగ్రి, మేడమెట్లు, పై అంతస్తు నిర్మాణం తదితర చోట్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, అటువంటి చోట రక్షణచర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో చేపట్టిన నాడు నేడు పనులపై కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ఆమె సమీక్ష నిర్వహించారు. తరగతి గదుల మరమ్మతులు, కిచెన్ షెడ్లు, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతులు ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ పనులు వేగంగా జరగకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులకు కొరత లేదని, జిల్లాలోని పాఠశాలల వద్ద ఇప్పటికే సుమారు రూ.10 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నాయని, వాటిని త్వరగా ఖర్చుచేసి, పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే సిమెంట్, ఇసుక తదితర నిర్మాణ సామగ్రికి కూడా ఇబ్బంది లేదని, శానిటరీ పరికరాలను స్థానికంగానే కొనుగోలు చేసుకునే వెసులుబాటు కూడా ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. అన్నీ అందుబాటులోనే ఉన్నప్పటికీ నిర్మాణ పనులు వేగంగా జరగడం లేదన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణంపై వెంటనే స్టేజ్ అప్‌డేషన్ చేయాలని శుక్రవారం నాటికి బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఒక్క బిల్లు కూడా పెండింగ్ ఉండకూడదని ఆదేశించారు. మంజూరైన ప్రతి చోటా పని ప్రారంభం కావాల్సిందేని స్పష్టంచేశారు.

నెలాఖరుకు అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు

అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలల ప్రాంగణంలో 110 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, మరమ్మతుల స్థితిగతులను మండలాల వారీగా తెలుసుకున్నారు. రెండు రోజుల్లో సర్వే పూర్తి చేసి, అవసరమైన పనులకు ప్రతిపాదనలను పూర్తిస్థాయిలో పంపించాలని సూచించారు. పాఠశాలలకు స్మార్ట్ టీవీలు వచ్చిన వెంటనే బిగించాలని, ఇప్పటికే షెడ్యూల్ కూడా జారీ అయిందని తెలిపారు. అధికారులు సమన్వయంతో మరింత సమర్థవంతంగా పనిచేసి నాడు నేడు పనులను పరుగు పెట్టించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి, డీవీఈఓ ఆర్.సురేష్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, ఎంఈఓలు, మండల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



హాజరైన జిల్లా అధికారులు

పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు
- కొత్తవలస బీసీ బాలికల హాస్టల్ పరిశీలన
- వేరే చోటికి తరలించేందుకు నిర్ణయం



హాస్టల్ వార్డెన్ నీరజాకుమారిని విచారణ చేస్తున్న కేసలి అప్పారావు



వార్డెన్‌ను విచారణ చేస్తున్న జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి యశోధనరావు

కొత్తవలస: వసతి గృహాల్లో ఉన్న పిల్లల పట్ల వార్డెన్, సిబ్బంది అత్యంత బాధ్యతగా వ్యవహరించి తల్లిదండ్రుల మాదిరిగా విద్యార్థులను సాకాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో గల బీసీ బాలికల వసతి గ్రహంలో విద్యార్థినులను వార్డెన్ నీరజాకుమారి వేధింపులకు గురిచేస్తోందని సాక్షి దిన పత్రికలో మంగళవారం ప్రచురితమైన 'విద్యార్థినుల విలవిల' వార్తకు ఆయన స్పందిస్తూ మంగళవారం హాస్టల్‌ను పందర్శించి వార్డెన్‌ను విచారణ చేశారు. హాస్టల్ గదులను పరిశీలించి విద్యార్థినులతో మమేకమై పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల పట్ల తల్లిదండ్రుల కంటే ఎక్కువ బాధ్యతగా వ్యవహరించాలని వార్డెన్, సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం హాస్టల్‌కు హైస్కూల్‌కు మధ్య చాలా దూరం ఉందని హాస్టల్‌ను హైస్కూల్‌కు దగ్గరగా పోలీస్‌స్టేషన్ సమీపంలో గల ఎస్సీ బాలుర వసతి గృహంలోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాగా ఫిబ్రవరి నెలలో ఇదే హాస్టల్‌లో జరిగిన ఒక పరిణామంతో అప్పటి కలెక్టర్ ఎ.సూర్యకుమారి హాస్టల్‌ను సందర్శించి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి హాస్టల్‌ను పోలీస్‌స్టేషన్ సమీపంలో గల ఎస్సీ హాస్టల్‌లోకి మార్చాలని ఆదేశించారు.అయితే అనివార్య కారణాల వల్ల ఆ ప్రక్రియ జరగలేదు. ప్రస్తుతం బాలికల హాస్టల్ విద్యార్థినులు హైస్కూల్‌కు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారని దగ్గరగా గల ఎస్సీ హాస్టల్‌లోకి మార్చేందుకు ఉన్నతాధికారులతో చర్చిస్తామని చెప్పారు.

మధ్యాహ్న భోజనంపై సంతృప్తి

అనంతరం స్థానిక హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తయారీ, వంటల రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ 10వ తరగతి అత్యంత కీలకమైనదని సంస్కారవంతమైన, విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని చెడు స్నేహాలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమఅధికారి ఎం.యశోదనరావు, ఎంఈఓ-2 బండారు శ్రీనివాసరావు,హెచ్‌ఎం సీహెచ్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో బీసీ హాస్టల్ మార్పు

కొత్తవలస మండల కేంద్రంలోని కోటపాడు రోడ్డులో గల బీసీ బాలికల వసతి గృహాన్ని వారం రోజుల్లోగా పోలీస్‌స్టేషన్ సమీపంలో గల ఎస్సీ హాస్టల్‌లోకి మారుస్తామని వెనుకబడిన తరగతుల జిల్లా సంక్షేమ అధికారి ఎం.యశోధనరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన హాస్టల్‌ను సందర్శించి వార్డెన్‌ను విచారణ చేశారు. విద్యార్థులను వేరు వేరుగా కలిసి ప్రశ్నించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వార్డెన్‌పై వచ్చిన అభియోగాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

డెంగీపై అవగాహన కలిగి ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది

పార్వతీపురంటౌన్: డెంగీ వ్యాధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మలేరియా, ఫైలేరియా శాఖల ఉప సంచాలకుడు టి.రామనాథం అన్నారు. ఈ నెల1వ తేదీ నుంచి 31 వరకు జరిగే జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీని పార్వతీపురం పురపాలక శాఖ సంఘం కార్యాలయం వద్ద మంగళవారం ప్రారంభించి నాలుగు రోడ్ల కూడలి వరకూ డెంగీ వ్యాధిపై స్లొగన్స్‌తో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ చాలా ప్రాణాపాయంతో కూడుకున్న వెక్టర్ వల్ల సంక్రమించే వ్యాధిఅని తెలిపారు. ఈ వైరస్ వెస్ట్‌నైల్ ఇన్ఫెక్షన్ వల్ల వస్తుందని, జ్వరానికి సంబంధించినదని, డెంగీ వైరస్ ఏడిస్ దోమ కుట్టడం ద్వారా వ్యాపిస్తుందని వివరించారు. డెంగీ ఫీవర్ వచ్చిన ఆరు రోజుల తర్వాత దాని లక్షణాలు కనిపిస్తాయన్నారు. తీవ్రమైన తలనొప్పి, కీళ్ల నొప్పి, కండరాల నొప్పి, వికారం, అలసిపోవడం, జ్వరం, వాంతులు 5 రోజుల తరువాత చర్మంపై దద్దుర్లు కలుగుతాయని పేర్కొన్నారు. డెంగీ వ్యాధి రాకుండా ఉండాలంటే ఇంటి చుట్టుపక్కల ఖాళీ స్థలాల్లో వర్షం నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఇంట్లో ఉన్న ట్యాంక్, బారెల్, డ్రమ్ముల్లో నీరు తప్పనిసరిగా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఏడిస్ దోమలు పగటి పూట కుడతాయని, కాబట్టి పిల్లలు, వృద్ధులు, మధ్యాహ్నం విశ్రాంతి తీసుకునే మహిళలు దోమతెరలు ఉపయోగించాలని సూచించారు. డెంగీ సోకిన వారు వెంటనే ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జి.వెంకటరమణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు, డీఎల్‌ఓ శ్యామ్‌కుమార్, అసిస్టెంట్ మలేరియా అధికారి డి.సత్యనారాయణ పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆపద్బంధువు గురుదేవా

- సూపరింటెండెంట్ ఆఫ్ జైలర్ సెంట్రల్ ప్రిజన్



కృత్రిమ అవయవాల తయారీ యూనిట్‌లో తయారీ విధానాన్ని వివరిస్తున్న ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు

కొత్తవలస: దివ్యాంగుల పాలిట ఆపద్బంధువుగా గురుదేవా చారిటబుల్ ట్రస్టు నిలుస్తోందని సూపరింటెండెంట్ ఆఫ్ జైలర్(సెంట్రల్ ప్రిజన్) ఎస్.కిశోర్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్టును ఆయన తిరుమల హాస్పిటల్స్ ఎం.డి, విజయనగరం రోటరీ ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణకాంతితో కలిసి మంగళవారం సందర్శించారు. ముందుగా దివ్యాంగులకు అందించే కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం, ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు జీవితం అంకితం చేశారని ప్రశంసించారు. దివ్యాంగులకు ట్రస్టు అందిస్తున్న సేవ వెలకట్టలేనిదన్నారు. అనంతరం 50 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు, చెవిటి మిషన్‌లు, బ్లైండ్ స్టిక్స్, చంక కర్రలు,వాకర్స్ వీల్‌చైర్స్ అందించారు.అలాగే వంద మంది వృద్ధులకు రేషన్, పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ డాక్టర్ ఫణీంద్ర, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండు షాపుల్లో విక్రయాలు నిలుపుదల

- సోర్స్ సర్టిఫికెట్ లేనందున చర్యలు
- నకిలీలు విక్రయిస్తే చర్యలు
- బొబ్బిలి ఏడీఏ ఎం.శ్యామ్‌సుందర్



శ్రీదేవి ఆగ్రో ఏజెన్సీస్ షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ ఎం.శ్యామ్ సుందర్

గజపతినగరం: సోర్స్ (విత్తనధ్రువీకరణ పత్రం) సర్టిఫికెట్ లేకుండా విత్తనాలు విక్రయిస్తున్న రెండు షాపుల్లో అమ్మకాలు తక్షణమే నిలుపుదల చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌స్పెక్షన్ అధికారి, బొబ్బిలి ఏడీఏ ఎం.శ్యామ్ సుందర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం గజపతినగరం మండల కేంద్రంలో గల శ్రీదేవి ఆగ్రో, .శ్రీనివాస ఆగ్రో, మన గ్రోమోర్, శ్రీసత్య సాయి ట్రేడర్స్ తదితర షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను, విత్తనాలు,పురుగు మందులను పరిశీలించి మొలక శాతం కట్టే విత్తనాలను రైతులకు సరఫరా చేయాలని, నాశిరకం విత్తనాలు, పురుగు మందులను అమ్మజూపిన వారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.తనిఖీల్లో భాగంగా శ్రీదేవి ఆగ్రో కెమికల్స్‌లో వంగ విత్తనాలకు సంబంధించి, సాయిశ్రీనివాస్ ఆగ్రో ఏజెన్సీస్‌లో మొక్కజొన్న విత్తనాలకు సంబంధించి సోర్స్ సర్టిఫికెట్‌లు లేనందున ఆరెండు షాపుల యజమానులకు నోటీసులు ఇచ్చి అమ్మకాలు నిలిపివేశారు. కార్యక్రమంలో స్థానిక మండలవ్యవసాయ శాఖ అధికారిణి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హోటల్ అజంతా యాజమాన్యంపై చర్యలు

- పోలీసులకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు



బాధిత బాలికను పరామర్శిస్తున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: నగరంలోని మూడు లాంతర్ల సమీపంలో నిర్వహిస్తున్న హోటల్ అజంతా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు పోలీసులను కోరారు. తనపై అసభ్యకరంగా ప్రవర్తించి అమానుషంగా దాడి చేశారని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు ఓ బాలిక మంగళవారం ఫిర్యాదు చేసింది. ఈమేరకు స్పందించిన కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సిబ్బందితో కలిసి సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలికతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఎవరైనా, ఎక్కడైనా బాలలను శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట డీసీపీయూ అల్లు సత్యనారాయణ, యాళ్ల నాగరాజు ఉన్నారు.

భర్త చెంతకు భార్యా పిల్లలు



పోలీస్‌స్టేషన్‌లో భార్యా పిల్లలను రాంబాబుకు అప్పగిస్తున్న ఎస్సై

రాజాం సిటీ: తన భార్య ఇద్దరు పిల్లలు, ఈ నెల 1న అదృశ్యమయ్యారని భర్త పోలీసులకు ఫిర్యాదు చేసిన కేసులో 24 గంటల్లోనే తల్లీపిల్లలను వెతికి అప్పగించారు. దీనికి సంబంధించిన ఎస్సై పి.నీలావతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంతకవిటి మండలం బొద్దూరు గ్రామానికి చెందిన రాంబాబు భార్య అరుణకుమారి, కుమార్తె ద్రాక్షాయిని, కుమారుడు తేజేశ్వరరావులతో స్థానిక బాబానగర్‌లో నివాసం ఉంటున్నాడు. అయితే ప్రతిరోజూ మద్యం తాగి భార్యను కొట్టడంతో విసుగుచెందిన ఆమె ఎక్కడైనా దూరంగా బతుకుదామని అనుకుంది. ఈ నెల 1న కుమార్తెను కళాశాలకు, కుమారుడిని పాఠశాలకు తీసుకువెళ్తానని చెప్పి ఎక్కడికో వెళ్లిపోయింది. ఆమె దూరపు బంధువులను ఫోన్‌ల ద్వారా సంప్రదించి విశాఖపట్నంలోని గాజువాకలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో అక్కడినుంచి పిల్లలతోపాటు ఆమెను తీసుకువచ్చి భార్యాభర్తలకు కౌన్సెలింగ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

డిజిటల్ శిక్షణతో నాణ్యమైన బోధన



రాజాం జీఎంఆర్ఐటీలో శిక్షణ ఇస్తున్న ప్రిన్సిపాల్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ శిక్షణతో ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన చేసేందుకు అవకాశం ఉంటుందని జీఎంఆర్ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్రప్రభుత్వం అమలు చేయనున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్లానెల్స్ ఉపయోగం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్లానెల్స్ ద్వారా బోధన, పాఠశాల విద్యార్థులకు సమకూర్చిన బైజూస్ యాప్‌లోని కంటెంట్‌ను ఈ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్లానెల్స్ ద్వారా బోధించే అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ సామర్థ్యాన్ని, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు వినియోగించాలని సూచించారు. ఈ డిజిటల్ బోధన అందుకు ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ బ్రహ్మయ్య, కోర్సు డైరెక్టర్ ఆర్.మురళీకృష్ణ, ఫెసిలిటేటర్స్ కుమారావు చంద్రునాయుడు, ప్రసాద్, ట్రైనర్స్ సతీష్, రవికిశోర్, రాజాం, సీతంపేట, వీరఘట్టం, జియమ్మవలస మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు 360 మంది పాల్గొన్నారు.